ఆవ భూముల్లో అక్రమ దందా

- ప్రభుత్వ భూములపై కూటమి నాయకుల అజమాయిషీ
- వాటిని కౌలుకు ఇచ్చి శిస్తు వసూలు
- దర్జాగా అక్రమార్జన
- రాజకీయ నాయకుల అండదండలు


ప్రభుత్వం కొనుగోలు చేసిన ఆవ భూమిలో సాగు చేసిన మొక్కజొన్న తోట


రైతులతో మాట్లాడుతున్న రెవెన్యూశాఖ అధికారులు


కాపవరంలో అక్రమంగా సాగు చేసిన మొక్కజొన్నను ధ్వంసం చేయిస్తున్న వీఆర్వో

మధురపూడి: ఆవ భూముల ద్వారా అక్రమార్జనకు కూటమి నాయకులు తెరలేపారు. ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న భూములను రైతులకు కౌలుకు ఇచ్చి, వారి నుంచి శిస్తును వసూలు చేస్తున్నారు. కోరుకొండ మండలం బూరుగుపూడి సమీపంలోని ఆవ భూముల్లో ఈ దందా కొనసాగుతోంది. వివరాల్లోకి వెళితే.. రాజమహేంద్రవరం సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో పేదలకు ఇళ్ల స్థలాలుగా ఇవ్వడానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం బూరుగుపూడి సమీపంలోని 586 ఎకరాలను కొనుగోలు చేసింది. ఆ భూముల యజమానులైన రైతులందరికీ నగదు కూడా అందజేసింది. అయితే అప్పటి ప్రతిపక్ష నాయకులు ఈ భూములపై పెద్ద వివాదం లేపారు. అవి నివాసానికి ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. అనంతరం కోర్టుకు వెళ్లి ఆ భూములను పేదలకు పంపిణీ చేయకుండా అడ్డుకున్నారు.

ఆదాయ వనరు

ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో కూటమిలోని అప్పటి ప్రతిపక్ష నాయకులు కొత్త దందాకు తెరతీశారు. అప్పట్లో ప్రభుత్వం కొనుగోలు చేసిన ఆవ భూములపై అజమాయిషీ చేయడం మొదలు పెట్టారు. వాటిలో రబీలో ఆరుతడి పంటలను పండించేందుకు అవకాశం ఉండటాన్ని తమ ఆదాయ వనరుగా మార్చుకున్నారు. పంటలు పండించుకునేందుకు వాటిని కొందరు రైతులకు కౌలుకు ఇచ్చారు. వారి నుంచి భారీగా శిస్తు వసూలు చేస్తున్నారు.

పథకాలు నిల్ – వ్యాపారం ఫుల్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల సంక్షేమం అనే మాటను మర్చిపోయింది. వారికి పథకాలు అందజేయడం మానేసింది. సేవలను మొత్తం నిలుపుదల చేసింది. ఆ కూటమి నాయకులు మాత్రం కాసుల వేటలో పడ్డారు. మద్యం, ఇసుక, ఆవ భూములు.. ఇలా వేటినీ వదలడం లేదు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

ఆవ భూముల్లో కూటమి నాయకుల అక్రమ దందాపై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు కొందరు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ విషయం బయటకు వచ్చింది. కలెక్టర్ ఆదేశాలపై మండల రెవెన్యూ అధికారులు స్పందించారు. ఆవ భూముల్లో అక్రమంగా సాగుచేస్తున్న 30 ఎకరాల్లో 6.80 ఎకరాల విస్తీర్ణంలో పంటను ధ్వంసం చేయించారు. తహసీల్దార్ సుస్వాగతం ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది ఈ కార్యక్రమం చేపట్టారు. 80 సెంట్లలోని బీరకాయ తోట, ఆరు ఎకరాల విస్తీర్ణంలోని మొక్కజొన్న, టమాటా పంటను నాశనం చేశారు. మిగిలిన పంట అలాగే ఉంది. అయితే రెవెన్యూ అధికారులపై ప్రభుత్వంలో కొందరు వ్యక్తులు ఒత్తిడి చేస్తున్నట్టు సమాచారం

కొంత పంటను ధ్వంసం చేశాం



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆవ భూముల్లో సాగు చేసిన కొంత విస్తీర్ణంలోని పంటను ధ్వంసం చేశాం. ఆ భూముల్లో మొక్కజొన్న, టమాటాలను సాగు చేస్తున్నారు. ప్రభుత్వ భూముల్లో సాగు చేయడం అక్రమమని వారికి తెలియజేశాం. మళ్లీ సాగు చేయవద్దని హెచ్చరించాం.

– సుస్వాగతం, తహసీల్దార్, కోరుకొండ

అవినీతిమయం



కూటమిలోని నాయకులు మాటలు మాత్రం నీతిగా చెబుతారు. చేతలన్నీ అవినీతిమయంగా ఉంటాయి. ప్రభుత్వం కొనుగోలుచేసిన పొలాల్లో అక్రమంగా వ్యవసాయం చేయడం అక్రమం. పైగా అమాయక రైతుల నుంచి కౌలు పేరిట నగదు వసూలుచేయడం దుర్మార్గం. అక్రమార్జన పాల్పడుతున్న వారిని శిక్షించాలి.

– నక్కా రాంబాబు, గ్రామ సర్పంచ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్

సరికాదు



ప్రభుత్వ ఆస్తి అయిన ఆవ భూముల్లో అక్రమంగా పంటలు పండించడం సరికాదు. రాజకీయ నాయకుల అండదండలతోనే మొక్కజొన్న, కూరగాయలు, ఇతర పంటలను సాగు చేస్తున్నారు. ఈ భూములను రైతులకు ఇస్తున్న రాజకీయ దళారీలపై కేసులు నమోదు చేయాలి. వారిని కఠినంగా శిక్షించాలి.

– కంటే వినయ్‌తేజ, వ్యవసాయ సలహామండలి మాజీ నాయకుడు

క్లుప్తంగా

మంచం పట్టిన పింఛన్ దారుల తనిఖీ


చినకొండేపూడిలో మంచం పట్టిన పింఛన్ లబ్ధిదారుని పరిశీలిస్తున్న తనిఖీ బృందం

సీతానగరం: మండలంలోని 15 సచివాలయాల పరిధిలో మంచం పట్టిన పింఛన్ లబ్ధిదారులను బుధవారం వైద్య బృందాలు తనిఖీ చేశాయి. ఈ బృందాల్లో పీహెచ్‌సీ వైద్యులు, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది ఉన్నారు. పింఛన్ దారుల ఇంటికి వెళ్లి వారు పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఎం.భారతి విలేకరులతో మాట్లాడుతూ 15 సచివాలయాల పరిధిలో 34 మంది మంచం పట్టిన పింఛన్ దారులు ఉన్నారన్నారు. మొదటి వైద్య బృందం 20 మందికి, రెండో వైద్య బృందం 14 మందిని పరిశీలించినట్టు వెల్లడించారు. దీనిపై నివేదికను ప్రభుత్వానికి తనిఖీ బృందాలు అందజేస్తాయని తెలిపారు.

నేటి నుంచి భజేనారాయణ స్వామి అధ్యయనోత్సవాలు


వడిశలేరులో కొలువైన భజే నారాయణస్వామి

రంగంపేట: మండల పరిధిలోని వడిశలేరు ఇలవేల్పు శ్రీదేవి, భూదేవి సమేత భజేనారాయణ స్వామి తిరుకల్యాణ మహోత్సవాల సందర్భంగా గురువారం నుంచి అధ్యయనోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి ముమ్మన రాంబాబు రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ మల్లిరెడ్డి శ్రీనివాసులు బుధవారం తెలిపారు. ఆలయ అర్చకుడు చిలకమర్రి మురళీకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. వచ్చే నెల మూడో తేదీ వరకూ ఐదు రోజుల పాటు జరిగే ఈ అధ్యయనోత్సవాల్లో పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండకు చెందిన ముడుంబై రామానుజాచార్యులు, వేద పండితుడు రేగడమిల్లి రామదేవశర్మతో ఉదయం, సాయంత్రం శుక్ల యజుర్వేద పారాయణ జరుగుతుందన్నారు. వచ్చే నెల 7వ తేదీ నుంచి 12వ తేదీ వరకు తిరు కల్యాణ మహోత్సవాలు నిర్వహిస్తామన్నారు.

రేపు విద్యుత్ అంతరాయం

రాజానగరం: దివాన్ చెరువు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం రూరల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాట్ల శ్రీధర్ వర్మ తెలిపారు. 11 కేవీ ఫీడర్లపై వార్షిక మరమ్మతులు చేపట్టాల్సి ఉన్నందున దివాన్ చెరువు, శ్రీరామపురం, పాలచర్ల గ్రామాల్లో విద్యుత్ ఉండదన్నారు.

నరసన్న ఆలయ అభివృద్ధికి చర్యలు

మధురపూడి: కోరుకొండలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని నీరుకొండ వీరన్న చౌదరి తెలిపారు. దీనికి సంబంధించి రూ.36 కోట్లతో ఇప్పటికే ప్రణాళిక తయారైందన్నారు. మరిన్ని నిధులు రాబట్టేందుకు ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే బలరామకృష్ణ, రుడా చైర్మన్ బీవీఆర్ చౌదరి కృషి చేస్తున్నారన్నారు.

నైపుణ్యాలతో అనేక ఉద్యోగావకాశాలు


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

రాజానగరం: చదువుతో పాటు పారిశ్రామికంగా అవసరమయ్యే నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకుంటే ఉద్యోగావకాశాలకు కొదవ ఉండదని జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. భూపాలపట్నంలోని రైట్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ఓరియెంటేషన్ ప్రోగ్రామ్ జరిగింది. మురళీకృష్ణ మాట్లాడుతూ ఎంచుకున్న లక్ష్యాలను సాధించడం ఎంత ముఖ్యమో.. సమాజ హితంగా ఎదగడం కూడా అంతే అవసరమన్నారు. ఈ విషయాన్ని ప్రతి విద్యార్థి గ్రహించి సత్ప్రవర్తనతో పయనించాలన్నారు. లెర్నింగ్, స్ట్రాటజీస్, సోషల్ రిపోర్టు, నాలెడ్జ్ గేయినింగ్, నాలెడ్జ్ షేరింగ్ ప్రాముఖ్యతను వివరించారు. అలాగే స్నేహితుల ద్వారా కూడా జీవితంపై ప్రభావం ఉంటుందని, అందుకనే స్నేహాల విషయంలో కూడా మంచి చెడులను అంచనా వేసుకుని నడుచుకోవాలన్నారు. విద్యార్థి జీవితంలో పర్సనాలిటీ డెవలప్‌మెంట్, కమ్యూనిటీ స్కిల్స్, ఇమాజినేషన్, హార్డ్ వర్క్‌ల ప్రాముఖ్యతను తెలియజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఉత్తమంగా విశ్లేషించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జి.సాయిరాధాకృష్ణ, కరస్పాండెంట్ అడ్డాల శ్రీహరి, వైస్ చైర్మన్ టీవీఎల్ నరసింహారావు, కోశాధికారి రవికిరణ్, ప్రిన్సిపాల్ సుధీర్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్ పాల్గొన్నారు.

విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలి


పతకాలు, బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

బిక్కవోలు: విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకుని చదువులో విశేష ప్రతిభ కనబరచాలని రంగంపేట మండలం జి.దొంతమూరు గ్రామానికి చెందిన శ్రీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కె.శ్రీను అన్నారు. ఊలపల్లి ముల్లంగి బుల్లి వీరన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో ఆరు నుంచి పదో తరగతి వరకూ చదివి మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు బుధవారం శ్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పతకాలు, బహుమతులు అందజేశారు. వీరితో పాటు క్రీడలు, ఫైన్ ఆర్ట్స్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు కూడా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివేలా ప్రోత్సహించి, వారిని ప్రయోజకులుగా చేయాలనే ఉద్దేశంతో బహుమతులు అందిస్తున్నట్టు తెలిపారు. అనంతరం ఆయనను పాఠశాల హెచ్ఎం కె.అమ్మిరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ వైస్ చైర్ పర్సన్ ఆర్.వీరమణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను వినియోగించుకోవాలి


వీరంపాలెంలో పాడి రైతులకు మందులు అందిస్తున్న అధికారులు


కూనవరంలో మందులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ గంగాలక్ష్మి, కూటమి నాయకులు

రంగంపేట: జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి ఈ.జాన్‌పాల్ సూచించారు. మండల పరిధిలోని వీరంపాలెంలో బుధవారం నిర్వహించిన పశువైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి 31వ తేదీ వరకు మండలంలోని పలు గ్రామాల్లో ఉచిత ఆరోగ్య శిబిరాలు జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా పశువులకు చికిత్సలు, నట్టల నివారణ మందుల పంపిణీ, గర్భకోశ వ్యాధులకు చికిత్స, పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు, వ్యాధి నిరోధక టీకాలు, శాస్త్రీయ యాజమాన్యంపై అవగాహన కల్పిస్తామన్నారు. శిబిరంలో 53 పశువులకు వైద్య సేవలు అందించి, ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి జహంగీర్, జి.దొంతమూరు జూనియర్ పశు వైద్యాధికారి ఉమాదేవి, పశువైద్య సహాయకులు రాణి, శివ, దుర్గాప్రసాద్, సురేష్, సత్యకుమార్, గోపాలమిత్ర శివ, రైతులు పాల్గొన్నారు.

కూనవరంలో..

సీతానగరం: మండలంలోని కూనవరంలో 70 పశువులు, 250 మేకలు, గొర్రెల (జీవాలు)కు మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎ.ఫణీంద్ర వైద్యసేవలు అందించారు. శిబిరాన్ని సర్పంచ్ సుంకర గంగాలక్ష్మి ప్రారంభించగా, 55 మంది పాడి రైతులకు సంబంధించిన పశువులు, గొర్రెలు, మేకలకు డాక్టర్ ఫణీంద్ర వైద్య సేవలు అందించారు. సర్పంచ్ గంగాలక్ష్మి, కూటమి నాయకులు మాదవరపు కోటేశ్వరరావు, మాదవరపు వీరభద్రం చేతుల మీదుగా పాడి రైతులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీఏ ఆదిలక్ష్మి, ఏహెచ్ఏలు చిలకమ్మ, వెంకటేష్, అల్లు శ్రీనివాస్, శ్యామల, అశోక్ చక్రవర్తి, సౌశీల్య, బుజ్జమ్మ, గోపాలమిత్ర రామాచారి తదితరులు పాల్గొన్నారు.


కొంకుదురులో మందులు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

కొంకుదురులో..

బిక్కవోలు: కొంకుదురు గ్రామంలో నిర్వహించిన పశువైద్య శిబిరంలో 36 పశువులకు వైద్య సేవలు అందించారు. డీసీ చైర్మన్ కొవ్వూరి వేణుగోపాల రెడ్డి, సర్పంచ్ సత్తి వీరమణి, పశు వైద్యాధికారులు డీవీ ప్రవీణ్, జి.విదాజు, ఆర్.వెంకట్ పాల్గొన్నారు.

భగవద్గీతపై ఇంటింటా ప్రచారం


వెంకటాపురంలో ప్రచారంలో పాల్గొన్న భక్తులు

రంగంపేట: భగవద్గీత, వేమన పద్యాల ఆవశ్యకతపై ఇంటింటా ప్రచారం నిర్వహించినట్టు త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక రాజమహేంద్రవరం కమిటీ అధ్యక్షుడు శేఖర్‌బాబు తెలిపారు. మండల పరిధిలోని కె.కోటపాడు, పి.కోటపాడు, వెంకటాపురం, సుభద్రంపేట గ్రామాల్లో బుధవారం ప్రచారం నిర్వహించామన్నారు. యోగి వేమన జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. త్రైత సిద్ధాంత ఆదికర్త, హిందూ జ్ఞాన ప్రదాత ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన నిగూఢ తత్త్వార్థ బోధిని అనే గ్రంథంలో 110 వేమన పద్యాలకు ఆధ్యాత్మిక వివరం రచించారని, వీటితో పాటు భగవద్గీత ఆవశ్యకతను గ్రామాల్లో ఇంటింటా ప్రచారం చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సోమినాయుడు, గోవిందు, సత్యనారాయణ, శాంతి, సత్యవతి, చరిత, శివ, పరమేశ్వరి పాల్గొన్నారు.

చెత్త కొండ కరిగేనా..


డంపింగ్ యార్డులో కొండలా పెరిగిపోయిన చెత్త


చెత్తలోంచి వేరు చేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు

- నివాసాల మధ్య డంపింగ్ యార్డు
- 20 ఏళ్లుగా చెత్త డంపింగ్
- తొలగింపునకు నగరపాలకసంస్థ చర్యలు
- ఆరు నెలల్లో పూర్తయ్యే అవకాశం

సీటీఆర్ఐ: స్థానిక 45వ డివిజన్‌లోని ప్రధాన డంపింగ్ యార్డులో చెత్త విపరీతంగా పేరుకుపోయింది. ఇది దాదాపు 7 లక్షల మెట్రిక్ టన్నులు ఉంటుందని అంచనా. ఎందుకంటే సుమారు 20 ఏళ్లుగా నగరంలోని చెత్తను ఇక్కడే డంపింగ్ చేస్తున్నారు. దీంతో డంపింగ్ యార్డులో చెత్త కొండలా పెరిగిపోయింది. చెత్త కారణంగా సమీపంలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డంపింగ్ యార్డును వేరేచోటుకు తరలించాలని అనేక సార్లు అధికారులను వేడుకున్నారు.

కాలుష్య మండలి ఆదేశాలు

డంపింగ్ యార్డులోని చెత్తను తొలిగించాలని జాతీయ కాలుష్య నియంత్రణ మండలి ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఇక్కడి పేరుకుపోయిన చెత్త నిల్వలను తొలగించేందుకు నగరపాలక సంస్థ సిద్ధమైంది. ఇప్పటికే తడి, పొడి చెత్త విధానం అమలు జరుగుతున్న తరుణంలో అదే తరహాలో ఇక్కడ చెత్తను వేరు చేసే ప్రక్రియను చేపట్టనున్నారు. ప్రైవేట్ ఏజెన్సీలకు ఈ బాధ్యతను అప్పగించనున్నారు. డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్తను తరలించడానిక కనీసం ఆరు నెలలైనా పడుతుందని నగరపాలక సంస్థ అంచనా వేసింది. చెత్త నిల్వల వల్ల ప్రతి ఏటా స్వచ్ఛసర్వేక్షణ్‌లో నగరానికి ఇచ్చే ర్యాంక్ తగ్గిపోతోంది.

రోజుకు 160 మెట్రిక్ టన్నులు

నగరానికి ప్రధాన డంపింగ్ యార్డు కావడంతో చెత్తంతా ఇక్కడే వేస్తున్నారు. రోజుకు సుమారు 160 మెట్రిక్ టన్నుల చెత్తను ఇక్కడకు తీసుకువస్తారు. వాటిలో 40 మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు, మిగిలినవి తడి, పొడి చెత్త ఉంటున్నాయి. దాదాపు 20 ఏళ్ల ఇక్కడ చెత్తను నిల్వ చేయడంతో కొండలా పెరిగిపోయింది.

వాంబే గృహాల నిర్మాణం

ఇక్కడే దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో 2006లో వాంబే గృహాలను నిర్మించారు. ఒక వైపు లూథరన్ గిరిలోని ఇళ్లు, మరో వైపు వాంబే గృహాలతో పాటు ఈ ప్రాంతంలో సచివాలయం కూడా ఉంది. డంపింగ్ యార్డు కారణంగా ఈ సమీపంలోని ప్రజలందరూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై నగరపాలక సంస్థకు అనేక ఫిర్యాదులు చేశారు. అయితే చెత్తను ఎక్కడకు తరలించాలో తెలియకపోవడంతో డంపింగ్ యార్డులోనే ప్లాస్టిక్ వ్యర్థాలను వేరు చేసే ప్లాంట్ ఏర్పాటు చేశారు. అయినా పెద్దగా ఫలితం రాలేదు. కాగా.. డంపింగ్ యార్డు కారణంగా సమీపంలో నివసిస్తున్న వారికి ఆరోగ్య సమస్యలు, ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఒక్కోసారి చెత్తకు నిప్పు అంటుకుని దట్టమైన పొగ వెలువడుతోంది. దీంతో సమీపంలోని ప్రజలందరూ ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఫైర్ ఇంజిన్లతో వీటిని ఆర్పినా రెండు, మూడు రోజుల వరకూ అదుపులోకి రావడం లేదు.


భరించలేని దుర్గంధం



డంపింగ్ యార్డు నుంచి వెలువడుతున్న దుర్గంధాన్ని భరించలేకపోతున్నాం. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మాకు ఇక్కడ వాంబే గృహాలను కట్టించారు. అప్పుడు ఇంత చెత్త ఉండేది కాదు. కానీ ఈ 20 ఏళ్లలో చెత్త కొండలా పెరిగిపోయింది. వెంటనే దాన్ని తరలించాలి.

– ఉమా మహేశ్వరరావు, స్థానికుడు

ఇబ్బంది పడుతున్నాం



చెత్త సమస్యపై ఎన్ని ఫిర్యాదులు చేసినా, ధర్నాలు చేసినా ఎవ్వరూ పట్టించుకోలేదు. ఇక్కడ చెత్తను డంపింగ్ చేయడం కూడా మానలేదు. ఇక్కడ అందరూ పేద వర్గానికి చెందిన వారే ఉంటున్నారు. చెత్త నుంచి వస్తున్న దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నా.

– కె.సూరిబాబు, స్థానికుడు

ఖాళీ బిందెలతో మహిళల నిరసన


ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

మధురపూడి: కోరుకొండ మండలం గాదరాడ ఇందిరమ్మ, దుర్గానగర్ కాలనీలకు తాగునీరివ్వాలని స్థానిక మహిళలు కోరుతున్నారు. ఈ మేరకు బుధవారం ఖాళీ బిందెలతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ పంచాయతీ కుళాయిల ద్వారా నీరు సరఫరా కావడం లేదన్నారు. అక్కడున్న చేతిపంపులు కూడా పనిచేయక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కాలనీల్లో 200 మంది నివసిస్తున్నారని, నీరు సరఫరా కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యను పంచాయతీ అధికారులకు తెలియజేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.

150 గ్రాముల బంగారు వస్తువుల చోరీ

రాజమహేంద్రవరం రూరల్: ఇంట్లోని 150 గ్రాముల బంగారు వస్తువులను దొంగలు మాయం చేశారు. వివరాల్లోకి వెళితే.. దివాన్ చెరువు డీబీవీ రాజు విల్లాస్ హౌస్ నెంబరు 80లో బండారు రాంబాబు కుటుంబం అద్దెకు ఉంటుంది. ఆయనకు కర్ణాటకలోని మాన్వి గ్రామంలో వ్యవసాయ భూములు ఉన్నాయి. ఈ నెల 16వ తేదీన వ్యవసాయ పనుల నిమిత్తం ఆ కుటుంబం కర్ణాటక వెళ్లింది. మంగళవారం విల్లాస్‌లో ఉండే ఒక వ్యక్తి రాంబాబు విల్లాకు సంబంధించిన తలుపులు తీసి ఉండడంతో అతనికి ఫోన్ చేసి చెప్పారు. దీంతో బుధవారం కుటుంబ సభ్యులు వచ్చి చూసేసరికి బీరువాలోని 150 గ్రాముల విలువైన బంగారపు వస్తువులు కనిపించలేదు. వాటి విలువ రూ.4.50 లక్షలు ఉంటుందని రాంబాబు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తెలిపారు. సంఘటనా స్థలాన్ని తూర్పుజోన్ డీఎస్పీ బి.విద్య, బొమ్మూరు ఇన్‌స్పెక్టర్ కాశీ విశ్వనాథ్ పరిశీలించారు.

దివ్యాంగురాలికి చేయూత

మధురపూడి: కోరుకొండ గ్రామానికి చెందిన గరగ పాప అనే దివ్యాంగురాలికి విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు బుధవారం చేయూత అందించారు. ఆమెకు రూ.వెయ్యి నగదు, 10 కేజీల బియ్యం అందజేశారు. గరగ పాప ఇటీవల గోకవరంలోని ఆయన కార్యాలయానికి వెళ్లి సాయం కోరింది.

రోబోటిక్ టెక్నాలజీపై శిక్షణ

కంబాలచెరువు: భవిష్యత్తులో అన్ని రంగాలలో కృత్రిమ మేధ విస్తరిస్తుందని సీఎస్ఆర్ ఇండియా మేనేజర్ శ్రేయా సుధీర్ అన్నారు. స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాంలో భాగంగా స్థానిక కంటిపూడి రామారావు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం రోబోటిక్ టెక్నాలజీపై శిక్షణ ఇచ్చారు.